క్లుప్తంగా

రేపటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

గన్నవరం: మండలంలోని పురుషోత్తపట్నం శాఖ గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి కె.కృపానందం తెలిపారు. ఈ మేరకు శనివారం గ్రామంలో వేసవి విజ్ఞాన శిబిరంపై ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి సుదీర్ఘ విరామ సమయంలో జరిగే విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో పుస్తక పఠనం, చిత్రలేఖనం, కథలు తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు, ప్రతిభను మెరుగు పర్చేందుకు ఈ శిబిరం దోహదపడుతుందని పిల్లల తల్లిదండ్రులకు సూచించారు.

ఉపకరణాల పంపిణీ



గన్నవరం: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సంక్షేమం కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి బాపులపాడు, గన్నవరం, ఉంగుటూరు మండలాలకు చెందిన 14 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు భవిత కేంద్రాల ద్వారా ఉచిత విద్య, వైద్యం అందిస్తున్నట్లుగా చెప్పారు. వారి అవసరాలకు అనుగుణంగా విలువైన ఉపకరణాలను అందజేస్తున్నట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఎంపీడీఓ స్వర్ణలత, డీవైఈఓ కొండా రవికుమార్, ఎంఈఓలు రాంబాల్‌సింగ్, సాంబశివరావు, కమల తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్‌బీఐ మాజీ డెప్యూటీ జనరల్ సెక్రటరీ వి.భవానీప్రసాద్ చిన్నారులకు సూచించారు. సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియంలో మే ఒకటో తేదీ నుంచి జరగబోయే హాకీ సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ తీసుకునే చిన్నారులకు హాకీ స్టిక్స్, బాల్స్, కోన్స్‌ను శనివారం ఆయన బహూకరించారు. భవానీ ప్రసాద్ మాట్లాడుతూ హాకీ జాతీయ క్రీడ అని.. దీనికి రాష్ట్రంలో ఆదరణ తక్కువగా ఉందన్నారు. సింగ్‌నగర్ ప్రాంతంలో చిన్నారులు, యువత హాకీ ఆడటానికి ముందుకు రావడం శుభపరిణామమని.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ప్రతిభ చూపితే భవిష్యత్తులో స్పోర్ట్స్ కోటా ఫ్రీ సీట్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా వస్తాయన్నారు. చిన్నారులకు హాకీ కోచింగ్ ఇచ్చి వారిని ప్రోత్సహిస్తున్న కోచ్ రాజశేఖర్‌ను అభినందించి సత్కరించారు. ఎస్‌బీఐ రీజనల్ సెక్రటరీ కె.బదరిబాబు, స్టేట్ బ్యాంక్ హాకీ కెప్టెన్ ప్రభుకుమార్ పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం పనుల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): విద్యాధరపురం ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను ఇంజినీరింగ్ సిబ్బంది త్వరితగతిన పూర్తి చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా శనివారం ఆయన విద్యాధరపురం స్టేడియం, నైజాంగేట్ ఔట్‌ఫాల్ డ్రైన్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డు, లేబర్ కాలనీ, ఔట్‌ఫాల్ డ్రైన్, విద్యాధరపురం అన్న క్యాంటీన్, పంజా సెంటర్ ప్రాంతాల్లో పర్యటించారు. నైజాం గేట్ ఔటఫాల్ డ్రైన్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న ఔట్ ఫాల్ డ్రైన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి జరుగుతున్న డీసిల్టింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణనాయక్, అన్నపూర్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేఖ, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వరి రైతుల వర్రీ

- దాన్యం కొనుగోళ్లలో దళారులు, మిల్లర్ల మోసం
- డెల్టా గ్రామాల్లో దోపిడీకి గురవుతున్న రైతులు
- ఆరు గ్రామాల్లో వరి రైతులకు లభించని మద్దతు ధర
- ఖరీఫ్ లక్ష్యం పూర్తయిందనే నెపంతో మోసం



నూర్పిడికి నోచుకోని వరికుప్పలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆరుగాలం కష్టించి సాగుచేసిన ధాన్యం అమ్మకాల్లో దళారులు, రైస్ మిల్లర్ల దోపిడీతో అన్నదాత నష్టాలను చవిచూస్తున్నాడు. ప్రభుత్వ నిబంధనలు, రైతు పరిస్థితిని ఆసరాగా చేసుకుని దళారులు, రైస్ మిల్లర్లు హవా సాగిస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లకు అదును దాటిపోయిందనే సాకుతో రైతులను దోచుకుంటున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో మద్దతు ధర లభించక తక్కువ ధరకే ధాన్యం విక్రయిస్తున్నారు.

సమస్య ఇదీ..

బాపులపాడు మండలంలోని డెల్టా ప్రాంత గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో వరికోతలు పూర్తి కాగానే రైతాంగం రెండో పంటగా మినుము, పెసర వంటి పైర్లు సాగు చేసేందుకు వీలుగా, నూర్పిళ్లు జరపకుండానే ధాన్యాన్ని వరికుప్పలు వేస్తారు. మినుము, పెసర తీతలు పూర్తయిన తర్వాత మార్చి, ఏప్రిల్ నెలల్లో వరికుప్పలను నూర్చి ధాన్యాన్ని విక్రయిస్తుంటారు. ఏప్రిల్ వరకూ ఆగిన వరి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించటం లేదు.

ఇంకా పది వేల ఎకరాల్లో..

మండలంలోని డెల్టా గ్రామాలైన కానుమోలు, కె.సీతారామపురం, దంటగుంట్ల, కాకులపాడు, ఆరుగొలను, తిప్పనగుంటలో దాదాపు 10 వేల ఎకరాల్లో ఈ తరహాలోనే నూర్పిళ్లు సాగుతుంటాయి. ఈ నేపథ్యంలో నవంబర్‌లోనే విక్రయించాల్సిన ధాన్యం ఆలస్యం కావటంతో దళారులు, రైస్ మిల్లర్లు దీనిని అదునుగా తీసుకుని తక్కువ ధరకు రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు.

తక్కువ ధరకు అమ్మి నష్టపోతున్న రైతులు..

ప్రభుత్వ మద్దతు ధర కంటే కనీసం బస్తా ధాన్యానికి రూ.200 నుంచి రూ.250 వరకు రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్లు ఇప్పటికే పూర్తి కావటంతో ధాన్యం కొనుగోలు చేయలేమంటూ రైతులను రైస్ మిల్లర్లు ఆందోళనకు గురిచేస్తూ లబ్ధి పొందుతున్నారు. చివరకు వచ్చినకాడికి అమ్ముకునే పరిస్థితిలో మిల్లర్లు ఇచ్చినంత తీసుకుని ధాన్యాన్ని అప్పగిస్తున్నారు. పంట సాగు చేసేందుకు పెట్టుబడి కోసం చేసిన అప్పులకు వడ్డీ పెరిగిపోతుందనే భయాందోళనకు రైతులు చేసేదిలేక దళారులు, మిల్లర్లు అడిగిన రేట్లకే ధాన్యాన్ని విక్రయిస్తున్నారు.

రైతుల వేదన..

దీంతో ఒక్కో ఎకరాకు రూ.8 వేలపైగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల నుంచి తక్కువ ధరలకే కొనుగోళ్లు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు మాత్రం మద్దతు ధరలకే అమ్మి సొమ్ము చేసుకుంటూ లాభపడుతున్నారు.

అధికారులు స్పందించాలి..

వరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాల్సిన అవసరం ఉంది. చివరి గింజ వరకు కొంటామని ప్రకటనలు చేసే విధానాన్ని ఆచరణలో చూపాలని రైతులు కోరుతున్నారు. పరిస్థితిని క్షేత్రస్థాయిలో సమీక్షించి రైతులకు న్యాయం చేయాలంటున్నారు.

టెన్త్ టాపర్ బ్రదర్స్‌కు కలెక్టర్ ప్రశంస



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ఇరువురు అన్నదమ్ములను కలెక్టర్ డీకే బాలాజీ శనివారం తన చాంబర్‌లో అభినందించారు. ఉంగుటూరు మండలం మధిరపాడు గ్రామానికి చెందిన ఇందుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులు దుబ్బాకుల దుర్గా యశ్వంత్ 591 మార్కులు, దుబ్బాకుల వీర వెంకటనాగేంద్ర 589 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని ప్రత్యేకంగా ప్రశంసించారు. భవిష్యత్తులో ఏం చేయాలనుకుంటున్నారని వారిని అడగ్గా ఒకరు చార్టర్డ్ అకౌంటెంట్, మరొకరు ఇంజినీర్ అవుతామని తెలిపారు. ఉంగుటూరు మండలం మధిరపాడు గ్రామానికి చెందిన ఈ విద్యార్థుల తల్లిదండ్రులు దుబ్బాకుల నరసింహారావు, నాగదుర్గ వ్యవసాయ కూలీలు. అనంతరం కలెక్టర్ అన్నదమ్ములిద్దరికీ సొంత నిధులతో స్మార్ట్ వాచ్‌లను బహూకరించారు. కార్యక్రమంలో డీఈవో పీవీజే రామారావు, విద్యార్థుల తల్లిదండ్రులు దుబ్బాకుల నరసింహారావు, నాగదుర్గ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీతారాం పాల్గొన్నారు.

పొలాల్లో మట్టి నమూనాల సేకరణ



మట్టి నమూనా సేకరిస్తున్న వీఏఏ

గన్నవరం: ప్రతి రైతు తాము సాగు చేసే నేలను రెండు మూడేళ్లకు ఒకసారి మట్టి నమూనాలు తీసి భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వీవీఎస్ఆర్ఎస్.హరీష్ కుమార్ సూచించారు. ఈ మేరకు శనివారం మండలంలోని పలు గ్రామాల్లో భూసార పరీక్షల నిమిత్తం పొలాల్లో మట్టి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది మండలంలో 1,475 మట్టి నమూనాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో వీఏఏలు పొలం వద్ద నుంచి మొబైల్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత మట్టి నమూనా సేకరించడం జరుగుతుందన్నారు. భూసార పరీక్షల పట్ల ఆసక్తి కలిగిన రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని చెప్పారు. సేకరించిన మట్టి నమూనాల పరీక్షల అనంతరం ఫలితాలను సాయిల్ హెల్త్‌కార్డు ద్వారా తెలియజేస్తామన్నారు. ఈ ఫలితాలకు అనుగుణంగా భూమికి కావాల్సిన మోతాదులో ఎరువులు వాడకం వల్ల పెట్టుబడులు తగ్గి పంట దిగుబడులు పెరుగుతాయని తెలిపారు.

మాజీ సైనిక ఉద్యోగుల సంఘం నిరసన గళం



పోరంకిలో నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ సైనిక ఉద్యోగుల సంఘం

పెనమలూరు: కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు అమానుషంగా కాల్పులు జరిపి పర్యాటకులను హతమార్చిన ఘటనపై పోరంకిలో మాజీ సైనిక ఉద్యోగుల సంఘం శనివారం కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిగడప మున్సిపల్ కమిషనర్ భవానిప్రసాద్ మాట్లాడుతూ ఉగ్రవాదులు అమాయక పర్యాటకులను హతమార్చటాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగులు మోటూరి శంకర్‌రావు, గోపాలకృష్ణ, ఠాగూర్, అబ్దుల్ ఖలీల్, ఎస్‌కె.వలి, టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయా ఆనంద్‌ప్రసాద్, బోడె వెంకట్రామ్, రామినేని శివాజీ, పలువురు పాల్గొన్నారు.

వేసవి జాగ్రత్తలు తప్పక పాటించాలి



ఫ్రూట్ సలాడ్‌ను పంపిణీ చేస్తున్న సీపీఐ నేతలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని.. జాగ్రత్తలను తప్పక పాటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. సీపీఐ నాయకుడు కేవీ భాస్కరరావు ఆధ్వర్యంలో పాదచారులకు ఫ్రూట్ సలాడ్, మజ్జిగ, టోపీల పంపిణీ కార్యక్రమం సింగ్ నగర్ పైపులరోడ్డు సెంటర్‌లో శనివారం జరిగింది. శంకర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ అధికారులు చలివేంద్రాలతో పాటు మజ్జిగ పంపిణీ కార్యక్రమాలు కూడా నిర్వహించాలని కోరారు. సీపీఐ ఎప్పుడూ ప్రజల పక్షంగా నిలుస్తుందని.. తాము పోరాటాలతో పాటు సేవా కార్యక్రమాలలో కూడా ముందంజలో ఉంటామన్నారు. నగర ప్రజానాట్య మండలి అధ్యక్షుడు షేక్ నజీర్, బాషా పాల్గొన్నారు.

ఘనంగా సాయి గీతామందిర వార్షికోత్సవం



పెనమలూరు: కానూరు శ్రీసాయిగీతా మందిరం 24వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. గీతామందిరంలో శ్రీషిరిడీ సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 5.15 గంటలకు కాగడా హారతి, 6.10 గంటలకు 108 లీటర్ల ఆవు పాలతో అభిషేకం, 8.30 గంటలకు పల్లకీపూజ, 10 గంటలకు మల్లెలార్చన, 11 గంటలకు సాయిబాబా భజన చేశారు. భక్తులు బాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు హారతి ఇచ్చి అనంతరం 5 వేల మంది భక్తులను అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ భవానీప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



మారని గుణ వర్ధన్ (ఫైల్)

రామవరప్పాడు: మార్కులు తక్కువ వచ్చాయని మందలించడంతో ఓ విద్యార్థి కళాశాల నుంచి అదృశ్యమైన ఘటన విజయవాడరూరల్ మండలం గూడవల్లి చైతన్య కళాశాలలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..చిత్తూరు జిల్లా తిమ్మనాయని పల్లికు చెందిన మారని గుణ వర్ధన్ (17) గూడవల్లిలోని చైతన్య కళాశాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేశాడు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో మార్కులు తక్కువ వచ్చాయని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో కళాశాల నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. విద్యార్థి వెళ్లిపోయిన సమయంలో సీకే అని అక్షరాలతో ఉన్న టీ షర్ట్, ప్యాంట్ ధరించాడు. రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో సంచరించే అవకాశం ఉందని ఎవరికైనా ఆచూకీ తెలిస్తే పటమట పోలీస్ స్టేషన్ 94406 27036, 94401 78369 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

తేనెటీగల దాడిలో పది మందికి గాయాలు

గన్నవరం: తేనెటీగల దాడిలో పది మంది గాయపడిన సంఘటన స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న గానుగ చెట్టుపై ఉన్న భారీ తేనెతుట్టు కదిలి తేనెటీగలు ఆ ప్రాంతంలో వ్యాపించాయి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి భూముల క్రయవిక్రయాల నిమిత్తం వచ్చిన జనంతో పాటు రోడ్డుపై వెళ్లే వారిపై తేనెటీగలు మూకుమ్మడిగా దాడిచేశాయి. తేనెటీగల దాడిలో ఇరువురు తీవ్రంగా గాయపడగా, మరో ఎనిమిది మంది స్వల్పంగా అస్వస్థతకు గురయ్యారు. మరికొంత మంది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు సమీపంలోని దుకాణాల్లోకి పరుగుల పెట్టి తలుపులు వేసుకుని తేనెటీగల దాడి నుంచి తప్పించుకున్నారు. సుమారు గంట పాటు తేనెటీగల సంచారంతో ఆ ప్రాంతం జనసంచారం లేక నిర్మానుష్యంగా మారింది.

ముఠా కార్మిక హక్కుల పరిరక్షణకు చట్టాలు అవసరం



ముఠా కార్మికుల ప్రదర్శన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అసంఘటిత రంగంలోని ముఠా కార్మికుల హక్కుల పరిరక్షణకై చట్టాలు తీసుకురావాలని సీపీఐ నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అనుబంధ ముఠా కార్మిక సంఘం 43వ మహాసభ సందర్భంగా కార్మికులు పాతబస్తీ లెనిన్ భవన్ వద్ద నుంచి ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన సామరంగం చౌక్, గుడివాడ వారి వీధి, మెయిన్ బజార్ ప్రాంతాల మీదుగా ముందుకు సాగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎటువంటి చట్టం లేనటువంటి ముఠా కార్మికుల జీవితాలకు భద్రత లేకుండా పోయిందన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు లేకపోవడంతో వృద్ధాప్యంలో వారికి ఎటువంటి భద్రత లేదన్నారు. దశాబ్దాల కొలది యజమాని దగ్గర పని చేసే ముఠా కార్మికుడు, తాను పనిచేస్తున్న యజమాని నగరం నుంచి నగర శివారు ప్రాంతాలకు తన వ్యాపారాన్ని తరలిస్తే, యాజమానితోపాటు ముఠా కార్మికులను కూడా అక్కడ పని చేయించుకునేందుకు తీసుకెళ్లటం న్యాయమని, అట్లా కాకపోతే దశాబ్దాలకు ఆ యజమానుల దగ్గర పనిచేసిన ముఠా కార్మికుడు తన జీవనోపాధి కోల్పోతున్నారన్నారు. నేడు పెరిగిన ధరలకు జీవనాన్ని కొనసాగించ లేని కార్మికులకు సొంత ఇళ్లు లేని దుస్థితి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని ముఠా కార్మికులకు ఇంటి స్థలం, ఇచ్చి నిర్మాణానికి ఆర్థిక సహాయం చేసేందుకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు, ముఠా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వియ్యపు నాగేశ్వరరావు, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు కేఆర్ ఆంజనేయులు, ముఠా కార్మిక సంఘం నగర అధ్యక్షుడు చొప్ప శ్రీరామచంద్రమూర్తి, సంఘం నాయకులు బోను చిన్న శ్రీరాములు, బత్తుల తిరుపతయ్య, నాగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బైపిళ్ళ సత్యనారాయణ, మరిపిళ్ళ మధు, జగదాపు సన్యాసిరావు, కాకి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఆర్‌కే డేవిడ్

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): సమాచార హక్కు చట్టం పారదర్శకంగా అమలు చేయాలని ప్రజాపరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఆర్‌ఏ డేవిడ్ అన్నారు. శనివారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో సమితి ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమాచార కమిషన్లు పూర్తి స్వేచ్ఛ, స్వతంత్రంగా పనిచేసేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో పోరాటాల ఫలితంగా ఆర్టీఐ చట్టం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ చట్టం ప్రకారం ప్రజలు కోరిన సమాచారాన్ని నిర్దేశించిన సమయానికి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు పర్వతనేని హరికృష్ణ, రాష్ట్ర కార్యదర్శి పి.రవికుమార్, గౌరవ అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది పిచ్చుక శ్రీనివాసరావు, అడ్వకేట్ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

20 రోజులుగా నీరు అందక ఇబ్బందులు



సమస్యలపై సర్పంచికి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు రవీంద్ర

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం ఎస్సీ ఏరియాలో బోరు ఎండిపోయి గత 20 రోజులుగా నీరు రాక స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి రవీంద్ర, వార్డు సభ్యుడు ప్రత్తిపాటి సుందరయ్య శనివారం సర్పంచి కాటూరి సరళను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎండాకాలంలో నీరు రాకపోవడంతో కనీస అవసరాలకు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, మంచినీటి చెరువులో నీరు ఫిల్టర్ కావడంలేదని, అదే నీరు ట్యాంక్‌లకు సరఫరా చేయడంతో గత్యంతరం లేక ఫిల్టర్ కాని నీటినే ప్రజలు తాగుతున్నారని తెలిపారు. సీఎస్ఐ చర్చి ఎదురుగా రోడ్డు, వాటర్ ట్యాంక్ రోడ్డు నిర్మాణంతో పాటు డ్రెయినేజీ నిర్మించాలని వారు విజ్ఞప్తి చేశారు.

హౌసింగ్ ఫర్ ఆల్ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉంగుటూరు(గన్నవరం): 'హౌసింగ్ ఫర్ ఆల్' పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలాల కోసం అర్హులైన పేదలు దరఖాస్తు చేసుకోవాలని ఉంగుటూరు తహసీల్దారు జె.విమలకుమారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి అర్హత కలిగిన వారు సమీపంలోని గ్రామ సచివాలయాలకు వెళ్లి ఇంటి స్థలం మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఇళ్లు లేని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో పంటల సాగు మేలు

నున్న(విజయవాడరూరల్): రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి పంటలను సాగు చేసుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలు కలుగుతాయని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్ అన్నారు. శనివారం నున్న గ్రామ వ్యవసాయ సేవాకేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి రంగనాథ్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి రసాయనిక ఎరువులు వాడటం వలన భూసారం దెబ్బతిందన్నారు. ఆ భూముల్లోనే పండిన పంటలను తీసుకోవడం వలన అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, కషాయాలతో వ్యవసాయ పంటలను పండించినట్టయితే ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చన్నారు. నవధాన్యాల గురించి, రాబోయే ఖరీఫ్ సీజన్లో చేపట్ట వలసిన విధి విధానాల గురించి వివరించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు ప్రకృతి వ్యవసాయం గురించి మాట్లాడారు.

గన్నవరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతా

గన్నవరం: నియోజకవర్గ కేంద్రమైన గన్నవరం గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళుతున్నట్లు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. ఈ మేరకు శనివారం గన్నవరంలో పర్యటించిన ఆయన ప్రభుత్వ ఆస్పత్రి ప్రహరీ నిర్మాణాన్ని, ఆగిరిపల్లి రోడ్డులో ఆక్రమణల తొలగింపు పనులను పరిశీలించారు. అనంతరం జాతీయ రహదారి డ్రెయినేజీ పూడికతీత పనులను ప్రారంభించారు. స్థానిక బీసీ కమ్యూనిటీ హాలు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని మాజీ ఎంపీపీ తుల్లిమిల్లి ఝాన్సీలక్ష్మి కోరారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ..స్థానికంగా మహాత్మాగాంధీ విగ్రహం ఆధునికీకరణతో పాటు ఆగిరిపల్లి రోడ్డు విస్తరిస్తున్నట్లు చెప్పారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, సర్పంచి నిడమర్తి సౌజన్య, ఉపసర్పంచ్ పాలడుగు నాని, ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు, పడమట రంగారావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల పంపిణీ



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు: పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యారుథలకు శనివారం ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. గంగూరు నోబుల్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు అక్బర్‌పాషా 19 మంది విద్యార్థులకు రూ.3 వేల చొప్పున నగదు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రమించి చదివితే లక్ష్యం చేరుకోగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయలక్ష్మి, డైరెక్టర్ రాజవంశ వర్ధన్‌రాయ్, స్థానికులు బాషా, అబ్దుల్‌కలామ్, ఇస్మాయిల్ షరీఫ్, అబ్దుల్‌గౌస్, ఆర్ఫన్‌పాషా పలువురు పాల్గొన్నారు.

హైస్కూలులో చెట్ల నరికివేత అడ్డగింత

హైస్కూల్ గ్రౌండ్లో చెట్టు నరకడంపై అభ్యంతరాలు



నున్న జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్లో నరికిన చెట్టు

నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్లో పురాతనమైన చెట్టును స్కూలు సిబ్బంది నరికించడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రౌండ్‌లో ఆటలాడుకునే విద్యార్థులు చెట్టు నీడలో సేదతీరుతుంటారని, రోజూ వాకింగ్‌కు, యోగాసనాలకు వచ్చే వారు చెట్టు నీడన కూర్చుని చేస్తుంటారని, అన్ని విధాలుగా ఉపయోగపడే చెట్టును ఎందుకు తొలగిస్తున్నారని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు, ఏఎంసీ మాజీ సభ్యుడు దండు సుబ్రహ్మణ్యం రాజు, మరికొందరు ప్రశ్నించారు. చెట్టును నరికే ముందు నిబంధనల ప్రకారం సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉందని అంటున్నారు. దీనిపై హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డిని వివరణ కోరగా చెట్టును నరకలేదని, కొమ్మలు తొలగించినట్లు చెప్పారు.